# THE JEWEL MINE OF SALVATION

## నిస్తార రత్నాకరము

## 1846

(1864లో లండన్ మిషన్ ప్రెస్, విశాఖపట్నం వారు ముద్రించినది.)

## నిస్తార రత్నాకరము అనగా రక్షణ యొక్క గని

### పాట

రాగము-రేగుప్తి తా-ఆట

1. వినరయ్య లోకస్థులారా విచారించి మీరు ।
యెనలేని ఘోరపాపాబ్ధినెట్లు తరించేరు ॥

2. గతిని గురించి శోధించి వెతుకబోరెవ్వారు ।
సతతమీ సంసారమునకై శ్రమబొందుచున్నారు ।

3. తథ్యంబుగాదీ సంసార ద్రవ్యాధికారంబు ।
మిథ్యమా త్రమక్షుల్మాయ మేటియంధకారంబు ॥

4. ధరణిలోనల్ప కాలంబె దాని ప్రయోజనము ।
మరణమైన పిదప వెంటనరుగునే తద్ధనము ॥

5. ధరణిపై బుట్టిన వారెల్ల మరణంబు గావలెను ।
మరణాంతమున మోక్షమునకో నరకమునకో
బోవలెను ॥

6. సత్యమైన ధర్మాశ్రయము సాధింప జాలకను ।
నిత్యముక్తి బొందలేరు నిరయమే యావలను ॥

# కీర్తన

రాగము–పంతురావళి తాళము–ఆది

1. కటకట నరకానలబాధకు మీరెటులోర్చెదరయ్య పటుభయదమహోత్కట గంధకలంపటమైరవిలెడు వహ్నింబడవలె ॥కటకట॥

2. పలుగోరుకుల రోదనముల రవములు గలవందెల్లపుడు । నలుదిక్కుల నిప్పుల కుప్పలు జల్లులవలె నంగంబులపై గురియును ॥కటకట॥

3. అనంత దేవుని కోపంబది చల్లార్ప నెవరి వశము । యినుపదుంప కొలిమిని యుడికెడు విధమున నుడుకద గవలయున్ ॥కటకట॥

4. పగటి వెలుగు దీపద్యుతి గనుగొనబడకనుండునం దు। దగలనువగలను బొగులుచు శాశ్వతయుగములుం దనలయున్ ॥కటకట॥

క॥ ఇటువంటి నరకబాధల ।
కెటులోర్చె దరయ్య దీని కేభయపడి మీ।
పెటుకుతనముడిగి భక్తి ।
స్ఫుటతులలై క్రీస్తు పాదముల గతిగనుఁడీ ॥

గీ॥ పుడమిగల సర్వపాపుల బ్రోచుకొరకు।
ధరణిపై వచ్చు సత్యావతార మొకటి ।
గలదు ప్రభువగు క్రీస్తు తత్కారణుండు ।
కొదువ యవతారములబద్ధ పదములరయ॥

# కీర్తన

రా-పంతువరాళి తా-ఆది

1. ఏలా విష్ణుండవతారంబులెత్తి నాడన్న। వాటి మూలము శోధింపవట్టి ముచ్చటలు గాకే మీ ఫలము ॥యేలా॥

2. మన దోసముల కొరకేమి పాట్లను బడుటయు లేదు। పాపుల కనికారముతో బ్రోచునట్టి కార్యమిసుమంతయుగనరాదు ॥యేలావి॥

3. ఘోరమైన పాపాత్ములనెల్ల కూరిమిచే బిలిచి । వారలభారముల వెడలింపనోపని బలహీనత్వము గనుగొనబడును ॥యేలావి॥

4. మొదట మీను రూపుబూన ముఖ్యకార్యమేమి । సోమకు - వెదకిచంపవచ్చె ననుట వెఱ్రి దేవత్వం బిదిగాక ॥యేలావి॥

5. కూర్మపు రూపుబూని యొక్క కొండనెత్తుట। యందుల ధర్మము మనకేమి గలదు దైవఘన హీనత్వంబగుపడు ॥నేలావి॥

6. సూకరావతారమెత్తుట చుల్కనగుమాట। జ్ఞానవి-వేక మెరుగని మృగలక్షణములు వినినం దులమనకేమి ఫలము ॥యేలావి॥

7. నరసింహమౌటెంతో భయంకరవిరూపము శాత్రవు - బరిమార్చుటకై యింతో కష్టము బ డుటయ దేవత్వమునకు దిగదిది ॥యేలావి॥

8. వామనుండై భిక్షమెత్త నేమియవసరంబు । అడిగిన కామితంబిచ్చెడు బలిదాతను కాలి క్రిం దను ద్రొక్కుటుచితమె ॥యేలావి॥

9. పరశురాముడై భూపతులనిరువదొక్క మారు। వారల శిరంబులను ఖండించెనట యీ చెడ్డతన మొక యవతారంబె ॥యేలావి॥

10. ఆలిని చెరకప్పగించి యతిదుఃఖము నొంది। రావణునాలమున బరిమార్చు రాముని యవతా రము వినసిగ్గు గాక ॥యేలావి॥

11. జారచోరతలు కృష్ణావతార చిహ్నములు। పాపపుదారి విస్తారముజేయుట యోదైవమా ష్యంబిది వినదగునే ॥యేలావి॥

12. తద్దయు శుద్ధబుద్ధా కృతిగని తగిన రూపులేక। నిలపిన మొద్దు విగ్రహమై నాడనుట మూఢదై వంబని యేర్పడుగద ॥యేలావి

13. కలికి రూపమూనుటొక్కటి గలుగునందురు। యందుల ఫలమేమయిన మనకు గలదా పాప రహితంబైన జాడను ॥యేలావి॥

14. యేసు క్రీస్త్వవతారమెత్తుటీ చందముగాదు। పాపము మోసుకొని బలిగా దేహంబిడి దోస కారులకిచ్చెను మోక్షంబే ॥లావిష్ణుండవతారంబు ॥

## పాట

రా–రేగుప్తి తా–ఆట

1. అన్నలారా యీలాగంటి యవతారంబులెల్ల।
యెన్ని సత్యమంటిరేని యిదుగో ముక్తికల్ల ॥

2. అందులో మోక్షసాధనములరసి చూడలేవు ॥
మందబుద్ధి కార్యాదులు మనకు పనికిరావు ॥

3. నానావిధుల నానాజనులు నానా గ్రంథములు।
మానుగాజ్ఞానము దెల్పిరి మనసు వచ్చినట్లు ॥

4. మతములెక్కువై మర్త్యులలోమంచరీతిజొచ్చె।
హితముగ రక్షణశాస్త్రంబె యిపుడు రవిగవచ్చె॥

5. దీనిసు ప్రసంగమిపుడు వీనులార వినుడి।
మానసంబులలర త్రాణమార్గము గన్గొనుడి ॥

6. ఆదిలోన నాది దేవుడతని వాక్యంబునను।
మోదమున స్థావర జంగమముల్ ముందు సృష్టించెను ॥

7. ఆ వెన్క నాదాము హవ్వయనెడు నరనారులను।
దేవుదాత్మ సాదృశ్యముతో గావించెవారలను ॥
8. వరుసనయ్యిద్దరు పాపా-వస్థబడకుంటేను ।
మరణ రోగదుఃఖములు మహికిరాకుండును ॥
9. పాపిష్ఠి సైతాను వలనుబడిరి వారిద్దరు ।
శాపమొంది దురాచార స్వభావులైనారు ॥
10. యీ యిద్దరి నుంచి మనుజులెల్ల గలిగినారు ॥
పాయక మానవసంతతులు పాపిష్ఠులైనారు ॥
11. జగతిలోనీ కారణమున సర్వమర్త్యులందరు।
అగణితముగ పాపమెదిగెననన్ని చోట్ల యందు ॥

# కీర్తన

రా–కళ్యాని

తా–ఆట

1. అయ్యోమానవులారా పాపమువృద్ధి। యయ్యొబలిమి మీరా। చెయ్యరానటువంటి చెడుదుష్కర్మము లెల్ల బయ్యమించుక లేక బహుగా జేయుచున్నా। రెయ్యెడను గనుగొన్న మర్త్యులు దయ్యముల బూజించి యొకరొకరొయ్యనను కయ్యములు సేయుచు నెయ్యములు విడి పగవహించిరి ॥అయ్యో॥

2. కపటము మదినుంచి మాటలతోటి కైవారమొనరించి। నిపుణత్వములు కొన్ని నెరపి యన్యుల సొమ్ము లపహరించెడు వారలధికమై యున్నారు। కృపణులై యొక గవ్వకోసం బెపుడు నన్నృతము లాడువారలు నెపములిడి శపియించు వారలు నిపుడు ధరనెల్లడల నిండిరి ॥అయ్యో॥

3. పరదైవ నిష్ఠలందు సత్యజ్ఞాన పరిహాసోక్తులయందు। పరనారీపరనిందా పరధనాసక్తులై విరివిగ నెంద రెందరు నిండియున్నారు। కరుణమాలినవారు మరిభీక రనరాంతకులు గ్రకోపులు నిరతమత్సరు లాత్మనుతి రతులరుదుగా పెరిగిరి ధరిత్రిని ॥అయ్యోమా॥

4. ఇందుకోసమె దేవుడు తొల్లిటి కాలమందే బంపెను కీడు। అందరిట్లతి పాపులైనా యందెనమంద్రు మంది దక్కనుదక మయకాల మొనరించి। యందరి నిబరిమార్చి యంతకు ముందు పొందుగ బ్రోచునెనిమిది మంది చేత మనుష్యవితతి ధరందనర బుట్టించె పెక్కుగ॥ నయ్యో మానవులారా॥

క॥ ఈ విధమున సర్వేశుడు ।
నోవహు సంతతులచే మనుష్యవితానం ।
బావిర్భవింపజేసెను ।
కేవల నరజాతి భువిని గ్రిక్కిరియంగన్ ॥

గీ॥ మరియు రెండవమారిట్లు మనుజకోటు ।
లవనిపైబుట్టి మరలి పాపాత్ములైయ।
పారదేవుల గొలచి దౌర్భాగ్యవిగ్ర॥
హాదిపూజల స్వేచ్ఛావిహారులైరి ॥

## ద్విపద

ఆది గనుంగొని దేవుడాత్మ భావించి ।
సదమలంబైన యాజ్ఞలు నిర్ణయించె ।
నా పరాత్పరునాజ్ఞలతి పవిత్రములు ।
పాప పుణ్యములు విభాగించి చూపు ।
పరమేశ్వరుడు తన వాయిని తెరిచి ।

నరులకు బంపించు న్యాయంబు వినరె ॥

1. మా(మ్రోల పెరదైవ మార్గముల్ వలదు ।

2. తా(మ్రాది వి(గ్రహస్థాపన దగదు ।

3. దైవనామంబు వ్యర్థత బల్కరాదు।

4. భావశుద్ధి సబాతు పాలింపవలయు।

5. మరి తల్లిదం(డ్రుల మన్నింప వలెను ॥

6. నరహత్య తగదు మానస వా(క్క్రియలను ।

7. జారత్వమెదనైన చర్చింపరాదు ॥

8. చోరత్వమాత్మలో చోర నివ్వదగదు ।

9. కల్ల సాక్ష్యంబు పల్కుట గూడదెపుడు।

తెల్లమి మది జూచు దేవుని యాజ్ఞ

10. నీ పొరిగింటి వానిది యేది యైన।

ఆపదయబ్బి నా యాసింప తగదు।

పదియాజ్ఞ లీరీతి (ప్రభువిచ్చి పిదప ॥

ముదముతో సారార్థమున నింక దెలిపె॥

మనసంతతోడ నాత్మబలంబుతోను ।

ఘనదేవునికి (ప్రేమ గావింపవలెను ।

తనపోల్కె పొరుగు మర్త్య(శ్రేణినెల్ల।

వినయంబుతో (ప్రేమ వెలయింప వలయు।

మరియు దేవుడు జెప్పె మనుజులతోడ।

నిరతంబు సత్య శాంతియు నీతికరుణ।

ధరియించినా యాజ్ఞ తప్పక నడువ।

వరమోక్ష రాజ్యవైభవ మొసంగెదను।

యిది తప్పి పాతకంబెవరు చేసినను।
తుది నరకాగ్నిలో ద్రోయింతుననుచు।
పరమేశుడీరీతి ప్రకటించు వెనుక।
మరలి జనులు పాప మగ్నులైరంత।

## కీర్తన

రా–హాయిరి తా–ఆట

1. ఈరీతి దేవాజ్ఞలుండను–వాటి–దారిలో నొకడు బోకుండెను–ధారుణి గల నరనారీజనములెల్ల సారె సారెకు దుష్ట చారులై చెడిపోయి॥ రీరీతి దేవజ్ఞ॥

2. భయము డెందములందు వీడిరి–పాప–మయమైన విధులందు గూడిరి–నియమోల్లంఘనులై దుర్ణయవృత్తిలో నాతిశయులై పిశాచి కాశ్రయులైరి జనులెల్ల ॥నీరీతి॥

3. నరనారీ బృందంబులెల్లను–పరా–త్పరుని శాప ప్రాప్తివల్లను। మరణాంతమున ఘోర నరకాగ్నిలోన నిర్భరమైన బాధలబడుటకు పాలైరి॥యీరీతి॥

4. యీలాటి దశ బొందిరందరు–యింక–నేలాగు రక్షింపుగందురు। శీలత్వమెదలేక చాల స్వపుణ్యము–లేలీల నొనరింప మేలించుకయు లేదు ॥యీరీతి॥

గీ॥ నరసమూహమిట్లు పరమేశ్వరుని కోప।
వహ్నిలోన గూలవలసియుండ ।
ముక్తిగోరి వ్యర్థ పుణ్యముల్ జేతురు।
హృదయ శుద్ధిలేని విధులవేల ॥

## కీర్తన

రా–కేదారగౌళ | రా–త్రిపుట

1. నిజముగ పుణ్యాత్ముడొకడీ నేలపైలేదు–వృజనములచే జెడిన మదిని పవిత్రపుణ్యంబెటుల బొడమును ॥నిజముగా॥

2. దురితలతలకు మూలకందము దుస్స్వభావము దాని గూడిన–నరులలో పరిశుద్ధ విధులెన్నటికి గనరావు॥ నెరవుగా సద్ధర్మములనే తెరగునను గావింప నేరరు ధరణిలోపల ముసిడి జెట్టున చెరుకు రసముండని విధంబున॥నిజముగా॥

3. మనసు క్రియలన్నిటికి మూలంబనుచు శాస్త్రము బలుకు మరియా మనసు శుచిగాకున్న నగునేతనకు ఫలసిద్ధి॥అనిశమా హృదయము దురిచ్ఛల నలరి మిథ్యాసక్తి నుండగ ఘనము గల సత్కార్యముల నిలమనుజుడెట్లొ నరింప జాలును ॥నిజముగా॥

4. నిరతమును కామాగ్ని చేతను గరుగుచున్న మనంబులోపల పరమధర్మములందు నెటువలె పాదుకొని యుండు॥ నిరపరాధి యొకండు లేదని నిక్కముగ గన వచ్చుచున్నది పరమ దేవుడు క్రీస్తు వశమున బంపు పుణ్యము బడయకుండిన ॥నిజముగా॥

## కీర్తన

రా–రేగుప్తి | తా–ఆట

1. అంతరంగములు శోధించి యన్నలారా గనుడీ।
   భ్రాంతిగలమీ కృతపుణ్యములపైని యాశవిడుడీ
2. సర్వోత్తముడు సర్వేశ్వరుడు సర్వదా నిర్మలుడు।
   నిర్వికారి నిష్కపటుండు నిత్యసత్యుడతడు॥

3. నిరపరాధి తానై దోషనరుల కార్యంబులను।
యొరపుగ పరిగ్రహింప నొప్పుకొనడెయ్యెడను॥
4. దేవుని దృష్టికి తుష్టిగ దిరుగువారు లేరు।
కావరించి యంతా శాపగ్రస్తులై యున్నారు॥
5. కావున మర్త్యోపాయములౌ కల్పితములెన్నైన।
వేవేలు పాలింప మోక్షమే విధమున రాదు॥
6. దేవిదైవాదులకు మిథ్యా సేవలెన్ని సేయ।
భావశుద్ధిగాని లౌక్య పథములన్ని మాయ॥
7. స్నానమంత్ర ధ్యాన దానసంతర్పణ కార్యములు।
మానుగా నెన్నియు జేసిన గాని నిష్ఫలములు॥
8. త్రాణోపాయమిటువంటి కార్యములబడయరాదు।
ప్రాణమున కాయాసము గాని ఫలము లేదు లేదు॥
9. శాపగ్రస్తులైనా సర్వజనులలో నెల్లపుడు।
సైపరాని బలు దుఃఖములు సంభవించె గనుడు ॥
10. జనులలోన వివిధ రోగ చయము జుట్టుకొనెను ।
మనసు నానావిధ దుఃఖముల బెనుచు కొనుచుజెడెను॥
11. ప్రళయకాల జలము లెట్లు వ్యాపించె నెల్లెడను-
పెలుచనట్లీయఘదుఃఖములు ప్రాప్తించెనంతటను॥
12. అందుకై మృత్యువు ప్రాణులపైనధి కారత్వమూని
బొంది వెడలించి యాత్మనుగొంపోయి వేగదాని॥
13. ఘనమైన యేసుని న్యాయాసనము మ్రోలనిడును।
తన విమర్శ వెనుక నరకస్థలము కాత్మజనును॥
మహావిచారాంత్య దినము మహిమవచ్చు దనుక ।
హాహాకారంబౌ కారాగేహముననుండ వలెను॥

# కీర్తన

రా-పంతువరాళి తా-ఆది

1. అతి భయమగు జగదంత్య దివససంగతివిన రేస్నేహితులారా! మతి మరలిచి దుష్కృతములు-విడి సద్గతి గోరరె క్రీస్తుని ద్వారా ॥అతి॥

2. కడువిలయ భయంకర బాకాధ్వని పడిగనూదునొక్కడు దూత। మడిగిన సమస్త మనుజుల తనువులు తడయక లేచును తత్క్షణమాత్రమె ॥అతి॥

3. తరగతిని నిజాత్మల గూడుకొ నిల్తురు క్రీస్తుని ముందర వరుసన్। దురితాత్మల పోతరమపుడే మగునరక బాధలెవ్వరు దప్పింతురు ॥అతిభ॥

4. పిన్నలు పెద్దలు పేదలు యోధులు వన్నియకెక్కిన వసుధేశుల్ । మన్నులోని నరవర్గములందరు మున్నొనర్చున్ నఘముల ఫల మొందుదు రతిభయమగుజగదంత్య॥

క॥ ఇటువంటి భయంకర సం।
కటమగు ప్రభుకోప దినము ఘణఘణనినదో।
త్కటముగ వచ్చుచునున్నది।
కటకట యింకేది దిక్కు కలుషాత్ముల్లకున్।

# కీర్తన

రా-భైరవి తా-ఆది

1. ఓహోయి మాయన్నలారా యుద్యోగింపండి। యిపుడేత్రాహిత్రా హీయనుచక్రీస్తుని దయను గోరండి॥

2. అంత్య దినమునాటి బాధలాలకించండి-నరక-ప్రాంత్యమునకు బోకమునుపే ప్రభువును వేడండి॥వోహో॥

3. మింట ప్రభువు తేజోమయమౌమేఘారూఢుండై యగ్నిమంటలీను సింహాసనమునంటి గూర్చుండు॥నోహా॥

4. అంధకారమగును సూర్యుడాదినమునందు కుముద బాంధవుండుమిగుల రక్తవర్ణమునొందు॥నో॥

5. కడుభీతిగ సర్వసృష్టి కంపింపుచు నుండున్-భూమి। కడలి యభ్రము తాపమున కరిగి పోచుండున్ ।వోహో॥

6. నరక ప్రచండాగ్ని కుండ-మరుదై గన్పడును। దాని-జొరక మరియే తెరవు పాపిష్ఠులకు గలుగును ॥వోహోయి॥

7. ప్రేమతో నడిగెదనేనో నా ప్రియబంధువులారా మీర। లామహా దినమందున దిరమై యటనిలు వంగలరా॥వోహా॥

8. కామక్రోధ లోభ మోహ గర్వగుణములను- మీరు ప్రేమించి చేసితిరిగదా పెక్కు విధములను॥ వోహోయి॥

9. కల్లలాడుచుండి ప్రొద్దు గడుపుచుంటిరే -యింక। చిల్లరదైవాలపూజ సేయకుంటిరే॥వో॥

10. దొంగతనము జూదమాడుట దుర్ణయము మీర। వేశ్యా-సంగమాది క్రియలు మీరు సలపకున్నా రా ॥వోహా॥

11. ప్రకటంబుగనైనా మరిగు-ప్తస్థలమందైనా
సేయు సకల క్రియలు ప్రభువు కెరుక సంపూర్ణముగాను ॥వోహా॥

12. జాతి గోత్రమడుగబోడు సర్వేశ్వరుండు- క్రియల - రీతిమనసుమాత్రమే విచారించే ప్రభువతడు ॥వోహా॥

13. క్షత్రియ బ్రాహ్మణ శూద్రచండాలాదులు-నరకపాత్రులైతమ దోషముల ఫలములు బొందుదురు ॥వోహా॥

14. దేవుని కోపాగ్ని యెదుట తృణతుల్యులైన-పాపి జీవులెల్లనే యుత్తరము జెప్పగలరన్న ॥వోహా॥

15. ఘోరమగు నీశాస్తినుంచి కుశలములేదన్న- మీరు। పారిపొంది పారిపొంది బ్రతుకెక్కడనున్న ॥వోహూ॥

16. యెటుబోగలరిక దిక్కుమీ కిపుడెవ్వరున్నారు-దేవుని। పటుశాపాగ్ని తప్పించే యాపాటివారెవరు॥ వోహూ॥

17. గురువాలేక పౌరోహితుడా మరియేమునివరుడా-లేక। పెరవేల్పా మిమ్ముద్ధరింపధరనే బలి గలడు ॥వోహూ॥

18. వీరంత బహు దోషులు మిమ్మేవిధమున గాచెదరు. గుడ్డి। వారు గుడ్డి వారికెట్లు దారి జూపెదరు ॥వోహూయీ॥

19. యెవరు పుట్టే రెవరు మోసేరీభారము నేడు- క్రీస్తు।దవతరించి చనుదెంచినాడ నాధబంధుండు ॥వోహూయీ॥

## కీర్తన

రా-రేగుప్తి తా-ఆట

1. చూడుడీ యోహూవా యొక్క చోద్యమైన ప్రియము
కీడు మాన్పి పాపాత్ములరక్షించుటకు కేవలము

2. తనప్రియాత్మజుని వేబంపెను మనుజలోకమునకు । యొనర
క్రీస్తుదుదయించెను దానొకడె త్రాతను మనకు॥

3. ధరను యూదరాజ్యమందు దావీదు పట్టణమున।
పరిశుద్ధాత్మవలన బుట్టే మరియా స్త్రీ గర్భమున॥

4. ప్రకటముగను త్రాణకర్త బహుగా నద్భుతములు
యకలంకుడై జేసె తానీ యవని నున్నన్నాళ్లు॥

5. కుంటివారి కడుగుల్ మరియు గుడ్డివారి కక్షుల్।
మంటిపాలై జనుపీన్గులకు మరల ప్రాణమిచ్చెన్॥

6. సారమైన శుభవార్తను దాచాటి యుపదేశించెన్।
పారమార్థజ్ఞాన క్రియలు బాగుగా బోధించెన్॥
7. దోషులపై వచ్చు నరక దుఃఖములు మానుపను
శేషమందు దుష్కర్మల చేత పట్టువడెను॥
8. పరుషమైన బహుబాధలచే ప్రాణమునుత్యజించెన్।
తిరిగీ జీవితుండై మూడో దినమునందు లేచెన్॥
9. పొందుగ పాపులబాధలు మేనందు ప్రభువుదా ల్చెన్।
అందుకొరకే రక్షణకర్తయనెడు ఖ్యాతినిలిచెన్॥
10. వరమహా శిష్టాచార నిరతుడితనిగనుడు।
పరమేశ్వరుని తనయుడేసు భగవంతుడే యనుడు॥

## ద్విపద

వినరయ్య నరులారా వివరింతునింక।
మనసులో విశ్వాస మార్గాన గనుడి।
యేసుని సుచరిత్రమిది పవిత్రంబు।
దోసకారుల పొందు దొలగించు మందు।
ఆరీతి ప్రభువు పాపాత్ముల కొరకు॥
దారుణంబైన బాధల తాను బడియె।
మనుజులు తనకుచీమల పోల్కెనుండ।
తనువు వారల భంగి ధరియించి పిదప।
ప్రాణదానమొనర్చె పాపుల కొరకు।
గాన యీ చోద్యంబు గనవినమెందు।
యీ కృపా ప్రమదంబులెవరిలో గలవు।

ప్రా కృత జనులలోపల జూడగలమె।
తన బంధుపోషణార్థము ప్రాణమిచ్చు।
జనుడొక్కడైన నెచ్చటలేదు లేడు।
మనుజ కీటముల దుర్మార్గుల గావ।
తన ప్రాణమర్పించె దయగల ప్రభువు।
నిరతమాజ్ఞాభంగ నీచాళి కొరకు
నరమేధమనెడు జన్నముతానె యయ్యె।
పాపులు జేయు పాపములను మోపు।
నా పరేశుడు క్రీస్తు నౌదలబెట్టె।
నందుశాసన ధర్మమధికతనొప్పె।
ముందటి న్యాయంబు ముదముగా నుండె।
సత్యధర్మన్యాయ సదముల దయలు।
అత్యంతమై త్రితో నైక్యతనొందె।
పరమధర్మమయుండు పరమేశ్వరుండు।
వరదయాళుడటంచు వర్ణించబడియె।
గొనబైన క్రీస్తుని గుణవిచిత్రములు।
మనుజ మాత్రులు దెల్ప మహిజాలగలరె॥

## కీర్తన

రా–తోడివున్నాగము తా–త్రిపుట

యేమాశ్చర్యము ప్రియులారా క్రీస్తు మరణము–ప్రేమ– జూడరే మనసారా

1. ఆ మహాత్ముడు మరణమగురీతి గనుగొన్న సామాన్యమగునొక్క జనుని చందముగాదు యీ మహిని గలపాపి జీవులపై మహాకృపజూ చి నిత్య–క్షేమ

మొసగెడు కొరకు బలు శ్రమచే మృతుండైనాడు స్వేచ్ఛను ॥యేమాశ్చర్యము॥

2. కొండల వలె భారమౌ-లోక పాపములు-దండిం పబడె ఘోరమై॥నిండా భారము క్రింద నిలు చునా వేళను-గుండెదిగులున తనువు నిండె రక్త పు చెమట-మెండుకొను దుఃఖములతో నాతం డ్రి యీ పాత్రమును నాకడ। నుండి తొలగించుటకు మనసయ్యుండినను జేయుమని వేడెను ॥యేమా॥

3. కడు దుర్మార్గులచేతను-క్రీస్తుడు పట్టు-పడెతానంతట తాను॥ చెడుగులెందరు నిందజేసి మోముపై నుమిసి వడిముళ్లతో నల్లబడిన కిరీటము-తడయ కొరడల బెట్టి కరముల నడుగులను శిలువనిడి మేకులు తొడిపి పక్కను రక్తజలములు దొరుగ కుంత ముగచ్చిరహహా ।యేమా॥

4. యిరు పార్శ్వములనిద్దరి-దొంగల నునిచి - మరణావస్థల బెట్టిరి-నిరపరాధి ప్రభువా దురితాత్ములొనరించు-తరుచు బాధలకోర్చిమరి వారి కరుణించి-యెరుగరేమి యొనర్తురోయీ। దురిత జీవులు వీరినోహో॥ పరమజనక క్షమింపుమని తన యరుల కొరకై॥ వేడుకొనియెను॥ యేమాశ్చర్యము॥

గీ॥ ఈ విధంబున తన జీవమిచ్చి లోక ।
రక్షకుడు పాపినరుల దుర్వారభాధ॥
లనుభవించె నిజాంగ మందద్భుతముగ॥
నిట్టి ప్రభువందునమ్మికల్వెట్టరయ్య॥

క॥ హితుడై సమస్త జన స
మ్మతుడై మృతినుంచి మూడవ దినంబున జీ॥
వితుడై క్రమ్మరలేచియు॥
నతులంబగు మోక్ష నగరి కరిగి వసించెన్ ॥

# కీర్తన

రా–శంకరాభరణము తా–ఆట

దేవుడిచ్చిన దివ్యశాస్త్రమిదేను మనకో యన్నలా రా- భావశుద్ధిని జేయు ఘనశుభ వర్తమానము దీనిపేరు ॥దేవుడిచ్చిన॥

1. భయముతో భక్తితో జదివిప్రాపు క్రీస్తుడటంచు నమ్మి- దయామయుడగు దేవుడే మనతంఁడ్రియని ప్రార్థనలు జేతము॥దేవుడి॥

2. పాపముల మన్నింపు కలిగి పరిశుద్ధి యేమదికి నొదవు శాపంబు దొలగిపోయి సంతోషము గలుగునాత్మకు ॥దేవుడి॥

3. సత్యశాంతములంకురించును సత్క్రియా ఫలములును బొడమును- నిత్యజీవము కలుగుటకు మరి ని స్సందేహముననుండును ॥దేవుడి॥

4. యీ సుమంగళ దివ్యశాస్త్రము నిప్పుడే మీరను సరించుడు – దోసంబుల మాని మోక్షపుత్రోవ గోరిన వారెల్లను ॥దేవుడి॥

5. పాపములలోనుంచి విడువడ పరమ సుఖమని దలతురేనియు- తాపమార్పును లేచి రండీత్వరగా క్రీస్తు నిశరణు బొందను ॥దేవుడి॥

6. దురిత రుణములు దీర్చుమధ్యస్థుండు గావలెనన్న వారలు త్వరగరండీ త్వరగరండీ వరదుడౌ క్రీస్తుకడకిపుడే ॥దేవుడి॥

7. స్వాదుపౌరోహితుని యుత్తమసద్గురుని వెతికెదరయేనియు-మోదమొప్పగ రండి రండీ-మోక్షపతి యగు క్రీస్తు నొద్దికి ॥దేవుడి॥

8. నిర్మాలాంతఃకరణ సౌఖ్యము నిజముగా వెతికేటి వారలు-ధర్మచిత్తుండైన క్రీస్తుని దరికి రండీ రండి వేగము ॥దేవుడి॥

9. మరణమునకై భయము పొందెడి మానసముగల వారలెల్లను- పరమశాంతి యొసంగుక్రీస్తుని పజ్జడాయగ రండివేగము ॥దేవుడి॥

10. మోక్ష రాజ్యము జేరగోరెడు బుద్ధిగలిగిన వారలెల్లను-రక్షకుండగు యేసునొద్దకు రండి రండీ విశ్వసించుచు ॥దేవుడి॥

## కీర్తన

రా-రేగుప్తి తా-ఆట

1. చూడుడీ బంధువులారా యేసుని యవతారంబు-
యీడు లేని సత్పుణ్యముల కిదియే యాకరంబు-
2. అంతము లేనటువంటి మోక్షానందంబు విడిచి-
యింతటి దుఃఖముల కొప్పి యిలకు నేగుదెంచి -
3. అతడు తన ప్రాణంబుచోట న ప్రియంబుదలచె-
హితముగా పాపాత్ములపట్ల నెంత ప్రేమ సలిపె-
4. యెంత దయావంతుడో మీరెంచి చూడరయ్య-
స్వంతపు జీవమర్పించే సద్గతిమీకియ్య-
5. అయితే మీరలతని నామమాశ్రయించుకొనర-
ప్రియముగల యాప్రభుని మీరు ప్రీతి చేయబోరా-
6. వారిశిష్యులౌటకిపుడు మీరుకోరుకొనర-
వారి పాదములు బట్టుదురా-వలదని వీడుదురా-
7. ధరణిలోన యితనికంటే త్రాణకర్త లేడు-
పరిశుద్ధాత్మనొసగి మదికి తిరమొనర్చు నితడు-
8. పరమేశ్వరుడు నియమించిన ప్రాయశ్చిత్తమితడు-
మరియే యుపాయంబు లేదు నరులలోన నిపుడు-
9. యేసు నామంబునకు సరి యింకేనామము లేదు-
యేసు సన్మార్గము దక్కనింకేమార్గము లేదు-

10. భారక్రాంతులైన సర్వపాపులారారండి-
పేరిమిని మిమ్మతడిబ్బంగి బిలుచు వాక్కు వినుడి-

11. త్రాణరత్నమదిగో క్రీస్తుదరికి బోయిగొనుడి-
దాని వెలమిమ్మడుగ బోడాత్మను ధరించుకొనుడి.

## ద్విపద

ఓ యన్నలార మీరూహించి మదిని-
మాయ సంసార భ్రమలను వేవిడరె-
జాతి వోవునటంచు జనుల నిందలకు-
భీతిమీ మతులందు బెట్టకుడయ్య-
మసిబొగ్గు కోసమై మాణిక్యరాశి-
పోసగ వీడుట వెర్రిబుద్ధియు గాదె-
పరకాలమున జాతిభ్రమలేమి లేవు-
మరి సారమగుజాతి మహిమకు క్రీస్తు
జీవులందరిని సృష్టించిన కర్త
దేవుడొక్కడె వాని దివ్యాజ్ఞలన్ని-
పరిపాలనము చేయ బరగిన నరులు-
నరదైవ సంతతి వారింకమరియు-
బలు దురాచార ప్రవర్తకులెల్ల-
నల పిశాచికులస్థు లనబడువారు-
నరక మోక్షములలో నను జేరుకొనిన-
యిరుజాతులే గాని యిక జాతిలేదు-
గాన మీరిలజాతి గర్వముల్ విడిచి-
పూనికతో క్రీస్తు బోధగనుండి-

కII తన తండ్రియైన దేవుని-
ఘనమగు కుడివైపుకేగి కర్తయెపుడు ప్రా-
ర్థన లొనరింపుచునున్నా-
డనిశము నిజభక్తలోక మలరుట కొరకై-

గీII 1. వారి ప్రియపాత్రులిచట జీవనము విడిచి-
యిలను క్రీస్తుని సేవంచు ఫలముగుడువ-
పరమ దూతలచే మోయబడుచు మోక్ష-
పురికిబోవుదు రానంద భరితులగుచు-

గీII 2. పుడమి వదలి మోక్షమున కేగునప్పుడు-
శిష్యగణముతోడ జెప్పె ప్రభువు-
మీరలేగి ప్రేమ మీరనీ శుభవార్త
జగతియంత దిరిగి చాటుదనియె-

కII ప్రతివారు వినగ చాటుడు
మతినమ్మిన వారికిడుదు మహిత సుఖముస-
మ్మతిలేక విశ్వసింపని-
ప్రతి నరునకు విడుదునరక ఫలము నిజముగన్

## కీర్తన

రా-సురట తా-ఆట

శుభవర్తమానము శోధింపరయ్య- ప్రభువేసు పొందు సంపాదింపరయ్య ॥శుభవర్తమానము॥

1. ఆది గ్రంథము హెబ్రుయును భాషనయ్యెన్ ఆ దట గ్రీకి భాషాంతరమయ్యెన్ సాదినింగ్లీషు భాషను తర్జుమాయెన్-మేదినంతటికి బల్మేలందు నయ్యెన్ ॥శుభవతన్మానము॥

2. బంగాళ నేపాళ పంజావిభాషన్ – రంగొ మహా రాష్ట్ర రాజ్యసంభాషన్ – శృంగారమైన తెనుంగు సుభాషన్ – మంగళముగ తర్జుమా చేయబడియెన్॥శుభ॥

3. అమెరికా ఆఫ్రికా ఆసీయరూభాషన్-క్రమముగ నాసావు కాస్మీరభాషన్–అమరు కర్నాట వడియా చైనాభాషన్ – ప్రమదంబుగా జేర్చబడి తర్జుమాయెన్ ॥శుభవార్తమానమున్॥

4. మళయాళ మగధ జర్మని దేశభాషన్ – సలలిత ముగ హింది సంస్కృత భాషన్ – వెలయుకొంకణద్రావిళ యురవభాషన్-చెలువుగా తర్జుమాచేయంగబడియెన్ ॥శుభవర్తమానమున్॥

5. మహి ద్వీపములలో నిర్మలముగనున్న – మహిత భాషల తర్జుమా జేసిరన్న –విహితమిా శుభవార్త వినినమ్ముకొన్న – బహు జనంబులు మోక్షప్రాప్తులైరన్న ॥శుభవర్తమానమున్॥

6. యిపుడు విచారించుడీ గ్రంథమునను – వుపదేశ మెటులున్న దుచితంబుగాను–నిపుణత్వమున దీని నేర్చుకోవలెను– విపరీత కథలన్ని విడువండి యికను ॥శుభవర్తమానమున్॥

7. మది ధర్మశాస్త్రము మన్నింపరయ్య–అది సత్య మని క్రీస్తు నాశింపరయ్య –తుది ఘోరనరకాగ్ని తొలగి పొందయ్య–ముదమొప్ప చిరమోక్ష పరమందరయ్య ॥శుభవర్తమానమున్॥

క॥ ఘనుడగు క్రీస్తు కరుణదే-
వుని పరసుఖ పూర్ణమైత్రి భూరి మహిమవే-
గను పరిశుద్ధాత్మైక్యత-
బొనరుగునుగాకల ప్రభుజనముకిలనామేన్-